ప్రజాశక్తి

శుక్రవారం 23 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మళ్లీ డిపోలకు వెళ్లాల్సిందే..!

◆ రేషన్ వాహన సేవల రద్దు ◆ వచ్చే నెల నుంచి అమలు

◆ ఎండియు ఆపరేటర్ల ఉపాధికి గండి ◆ ప్రత్యామ్నాయం చూపకుండానే నిలిపివేత

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, విశాఖ కలెక్టరేట్

రేషన్ సరుకులు పంపిణీ చేసే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండియు) వాహన సేవలను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. ఐదేళ్లగా లబ్ధిదారులకు వాహనాల్లో సరుకులు పంపిణీ చేస్తున్న ఎండియు ఆపరేటర్లు, హమాలీల ఉపాధిని దెబ్బతీసింది. ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా, 2027 వరకూ ఉన్న ఒప్పందాన్ని కొనసాగించకుండా ఉన్నఫలంగా వదిలిపొమ్మంది. వచ్చే నెల నుంచి వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని నిలిపివేస్తున్నట్టు మంగళవారం రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయంతో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని 2 వేల మంది ఉపాధిపై ప్రభావం పడింది. వారంతా గురువారం నుంచి ఆందోళన బాట పట్టారు. పంపిణీలో తలెత్తినట్లు చెబుతున్న లోపాలను ప్రభుత్వం సరిదిద్దకుండా వాహన సేవల వ్యవస్థనే ఏకంగా రద్దు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనకాపల్లి జిల్లాలో 1069 రేషన్ షాపుల పరిధిలో 5.47 లక్షల బియ్యం కార్డులున్నాయి. లబ్ధిదారులకు సరుకులు పంపిణీచేసే ఎండియు వాహనాలు 374 ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా విషయానికొస్తే 311 వాహనాలున్నాయి. ఒక్కో వాహనంలో ఎండియు ఆపరేటర్, హమాలీ పనిచేస్తున్నారు. సరుకులు ఎత్తిదించలేని వారు తమ సొంత డబ్బులతో మరో కూలీని పెట్టుకొని నెలలో పదిహేను రోజులు సరుకులు పంపిణీ చేస్తున్నారు. మిగిలిన పదిహేను రోజులు ఇతర పనులు చేసుకొని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వం 90 శాతం మిగతా 2లో..

విశాఖలో నిరసన తెలుపుతున్న ఎండియు ఆపరేటర్లు

ప్రభుత్వం పున: పరిశీలన చేయాలి

- సిఎంకు ఇఎఎస్.శర్మ లేఖ

▶ వార్త 2లో..

షెడ్యూల్డ్ ఏరియాలో..

గిరిజనులకు శత శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్ కల్పించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కేలా చూడాలని ఎపి ఎంఎస్ఎంఇ చైర్మన్, జనసేన రాష్ట్ర నాయకులు టి.శివశంకర్‌రావును అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీల నాయకులు కోరారు. ఎంవిపి.కాలనీలోని ఆయన నివాసంలో నేతలు కలిసి ఆదివాసీల సమస్యలను విన్నవించారు. ఆదివాసీ ప్రాంతంలో ఎంఎస్ఎంఇ ద్వారా ఆదివాసీ పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఏజెన్సీలో ఉద్యోగాలను గిరిజనులకే కేటాయించాలన్నారు. మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ పరిధి టీచర్ పోస్టులను మినహాయించి, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించి భర్తీ చేయాలన్నారు. సమస్యలను ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాచిపెంట అప్పలనర్స, కోటి, వరప్రసాద్, కుడుముల కాంతారావు, వంపూరి గంగులయ్య, కటారి శోభన్ కుమార్, సీసా శోభన్, కోరాబు సత్యనారాయణ, వంతల ఆనందరావు పాల్గొన్నారు.

శివశంకర్‌రావును కలిసిన ఆదివాసీ నేతలు

కెజిహెచ్ పీజీ హాస్టల్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో పీజీ చదువుతున్న రేడియాలజీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి మోతిలాల్ ఆత్మహత్య చేసుకున్నారు. పీజీ బాయ్స్ హాస్టల్‌లో గురువారం ఈ సంఘటన జరిగింది. మృతుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాడని హాస్టల్ సిబ్బంది తెలిపారు.

మృతి సమాచారం అందడంతో వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేస్తున్నారు. వ్యక్తిగత సమస్యల కారణంగానే ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

25వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె

▶ వార్త 2లో..

యోగా డే ప్రధాన వేదిక వద్ద పక్కా ఏర్పాట్లు

▶ వార్త 2లో..

25న గీతం బిజినెస్ స్కూల్ ప్రవేశ పరీక్ష

▶ వార్త 3లో..



మహిళకు కరోనా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కరోనా లక్షణాలు ఉండటంతో గురువారం పరీక్షలు చేసిన వైద్యాధికారులు కోవిడ్‌గా నిర్ధారించారు. ఆమెకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. ప్రజలు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

కొనసాగుతున్న ఉక్కు సమ్మె

విధులను బహిష్కరించి నిరసన తెలిపిన కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : అక్రమ తొలగింపులను నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ కార్మికులు తలపెట్టిన సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరుకుంది. విధులను బహిష్కరించి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. వారంతా కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రానున్న కాలంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యమం మరింత ఉధృతం కానుందన్నారు. ప్రస్తుత కాంట్రాక్టు కార్మికుల ఉద్యమం గెలిస్తే పని కోల్పోయిన వారంతా లోపలికి వస్తారని చెప్పారు. తుపాకులు ఎదుర్కోవటానికి కూడా కార్మికులు ప్రస్తుత తరుణంలో భయపడటం లేదన్నారు. కార్మికులంతా క్షణకాలం ప్లాంట్‌లో పనిచేయకుంటే ఉత్పత్తి స్తంభించిపోతుందని తెలిపారు. ప్లాంట్ నిర్మాణ సమయంలో అనుభవించిన శిక్షలను, కార్మిక పోరాటాలను గుర్తుచేశారు. ప్రస్తుత తరుణంలో ఐక్యతే ఆయుధంగా కార్మికులు ముందుకు సాగాలన్నారు. పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఐక్యంగా పోరాడి సాధించుకున్న హక్కుల రక్షణ కోసం ప్రతి కార్మికుడూ పోరాటాల్లో పాలుపంచుకోవాలన్నారు. పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు పర్మినెంట్ కార్మికుల మద్దతు ఉందని తెలిపారు. గతంలో కాంట్రాక్ట్ కార్మికులు 17 రోజులపాటు సమ్మె చేసి మూడు వేల రూపాయల జీతాన్ని పెంచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉన్న కాంట్రాక్టు కార్మికులతో పాటు మిగిలిన వారంతా సోషల్ మీడియాను ఉపయోగించి ఉక్కు ఉద్యమాన్ని ప్రపంచానికి తెలియజేయాలన్నారు. యాజమాన్యం చెబుతున్న కల్లబొల్లి కబుర్లను నమ్మవద్దని తెలిపారు. పర్మినెంట్ కార్మికులను కూడా ప్లాంట్ యాజమాన్యం ఎలా తొలగిస్తోందో తెలియజేశారు. కార్మికుల పొట్టలు కొట్టి బీచ్‌లో యోగా చేస్తామంటే ఎలా ఊరుకుంటామని మిగతా 2లో..

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, గంగారావు, చిత్రంలో జగ్గునాయుడు, నమ్మి రమణ తదితరులు

మొదటి పేజీ తరువాయి..

మళ్లీ డిపోలకు వెళ్లాల్సిందే..!

రాయితీతో ఎండియు వాహనాన్ని ఇచ్చింది. మిగిలిన పది శాతం వాహన బకాయిని కార్పొరేషన్ల ద్వారా చెల్లించే బాధ్యతను తీసుకుంది. ఈ వాహనాలను ఇప్పుడు ఆపరేటర్లకు అప్పగిస్తామని ప్రభుత్వం చెప్పడంలో న్యాయంలేదని బాధితులు అంటున్నారు. రేషన్ సరుకులు పంపిణీకి ఉపయోగపడే ఈ వాహనాలు ఇతర అవసరాలకు పనికిరావని చెబుతున్నారు. ఎండియు వ్యవస్థను ఒప్పందం ప్రకారం 2027 వరకు కొనసాగించాలని, లేదంటే అంతవరకు ప్రస్తుతం ప్రతి నెలా ఇస్తున్న రూ.18 వేల వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆపరేటర్ల నిరసన

ఎండియు వాహనాల ఆపరేటర్ల కాల పరిమితిని 2027 వరకూ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆపరేటర్లు ధర్నా నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ ఎండియు ఆపరేటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎండియు ఆపరేటర్లు 9260 మంది ఉన్నారన్నారు. 2021 ఫిబ్రవరి నుంచి రేషన్ పంపిణీ ప్రారంభమైందని, కరోనా వంటి విపత్కర సమయంలోనూ, విజయవాడలో వరదలు సంభవించిన సమయంలోనూ తమ వాహనాలు ద్వారా రేషన్ పంపిణీ విధానం ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. జూన్ 1 నుంచి ఎండియు వాహనాలను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం చెప్పడం రాష్ట్రంలో ఉన్న ఆపరేటర్లందరికీ తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. అగ్రిమెంట్ గడువు ముగియకుండానే తమను అర్ధాంతంగా తొలగించడం బాధాకరమన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వం పున: పరిశీలన చేయాలి

- సిఎంకు ఇఎఎస్.శర్మ లేఖ

ఎంవిపి.కాలనీ : ఎండియు వ్యవస్థ ద్వారా రేషన్ సరుకుల పంపిణీని రద్దు చేస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వం పున: పరిశీలన చేయాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఆపరేటర్లకు రేషన్ వాహనాలను బదలాయించడం కారణంగా కొంతవరకు వెసులుబాటు కలిగినా కొన్ని సమస్యలు తలెత్తున్నాయని పేర్కొన్నారు. ఎండియు వాహనాలను ఆపరేటర్లు ట్యాక్సీల రూపంలో ఉపయోగించి ఆర్జించే ఆదాయం తక్కువగా ఉంటుందని, ఆ వాహనాలపై ట్యాక్స్, ఇన్సూరెన్స్, ఇంధన ఛార్జీలు అధికంగా ఉంటాయని తెలిపారు. ఆ వాహనాలను సులభంగా అమ్ముకోవడం కుదరదన్నారు. ఒప్పందం ప్రకారం 2027 వరకూ ఎండియు ఆపరేటర్లను కొనసాగించాల్సి ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు.

కొనసాగుతున్న ఉక్కు సమ్మె

హెచ్చరించారు. సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉక్కు కార్మికులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సమ్మి రమణ, పెద్ద సంఖ్యలో ఉక్కు కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులు పాల్గొన్నారు.

ఛాంబర్‌ను ప్రారంభిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

డిప్యూటీ మేయర్ ఛాంబర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసికి ఇటీవల డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజుకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అధికారులు కేటాయించిన ఛాంబర్‌ను విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవిందరాజుకు వారిరువురు పుష్ప గుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. విశాఖ నగర అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బెహరా భాస్కరరావు, కొయ్యా ప్రసాదరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎఒబిలో పోలీసుల అప్రమత్తం

ప్రజాశక్తి-సీలేరు : చతీస్‌ఘడ్ సరిహద్దుల్లో మావోయిస్టులకు పోలీసులకు బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 28 మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. వరస ఎన్‌కౌంటర్లతో తీవ్రంగా దెబ్బతిన్న మావోయిస్టులు ప్రతీకార దాడులకు తెగబడతారని పోలీస్ ఇంటెలిజెన్సీ వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు కింద స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు.

నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

25వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్‌ఒలు) చేపట్టిన సమ్మె గురువారానికి 25వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా వారు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎంఎన్ఎస్.ప్రజ్ఞ మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేయాలన్నారు. 25 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి తమ రోదన వినిపించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంటా సుధ, మోజెస్, జస్వంత్, కల్పన, సుధా, మణి, స్వాతి, అమిత, యశ్వంత్, అరుణ పాల్గొన్నారు.

యోగా డే ప్రధాన వేదిక వద్ద పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ వేదికగా జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్‌కె బీచ్ కాళీమాత టెంపుల్ ముందు భాగంలో నిర్ణయించిన ప్రధాన వేదిక వద్ద పక్కా ఏర్పాట్లు చేయాలని వివిధ బృందాలుగా నియమించిన అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కాళీమాత టెంపుల్ వద్ద దేశ ప్రధాని, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు యోగాసనాలు వేస్తారని, దాన్నే ప్రధాన వేదికగా పరిగణించాలని, అక్కడ 15 వేల మంది భాగస్వామ్యం అవుతారని తెలిపారు. ప్రధాన వేదికను కొనసాగింపుగా పార్కు హోటల్ వరకు 50 వేల మంది పాల్గొంటారని, ఒక్కో కంపార్ట్మెంట్‌కు వెయ్యి మంది చొప్పున కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులను

మాట్లాడుతున్న జెసి

ఆయన ఆదేశించారు. 200 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు కలిగే విధంగా కంపార్ట్మెంట్లను తయారు చేయాలని, దానికి తగిన మ్యాపులు సిద్ధం చేసి నివేదించాలని సూచించారు. ప్రధాన వేదిక నుంచి పార్కు హోటల్ వరకు వచ్చే అతిథులకు అనుగుణంగా ఎవరు ఎక్కడకు చేరుకోవాలో తెలియజేస్తూ నివేదికలు రూపొందించాలని, ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో 2.50 లక్షల మంది భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాధుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు సుధాసాగర్, మధుసూదనరావు, జివిఎంసి సిఇ, పలువురు జిల్లా స్థాయి అధికారులు, జోనల్ కమిషనర్లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

పదవి కోసం ఏనాడూ పాకులాడలేదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పదవి కోసం తాను ఏనాడూ పాకులాడలేదని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివ శంకర్‌ను రామ్ గురువారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ నెల 12న గాజువాకలో తనపై జరిగిన దాడి గురించి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పదవి కోసం తాను ఏనాడూ పాకులాడలేదని, చంద్రబాబు నాయుడు సిఎం కావాలని మాత్రమే పాటుపడ్డానని అన్నారు. తెలుగుదేశం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అనుచరులు వారి స్వలాభం కోసం ఎంతటి నీచానికైనా ఒడికడతారని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు వున్నాయన్నారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. దాడి జరిగిన చోట సిసి కెమెరాల ఆధారాలను ప్రభుత్వం సేకరించాలన్నారు.

మహారాజశ్రీ జిల్లా ప్రధాన కుటుంబ న్యాయస్థానం కమ్ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, విశాఖపట్నం

బిట్వీన్: **F.C.O.P. 1372/2023**

తెరపల్లి హారిక ...పిటీషనర్

అండ్

తెరపల్లి రామ ప్రసాద్ ...రెస్పాండెంటు

నోటీసు

టు

రెస్పాండెంట్:

తెరపల్లి రామ ప్రసాద్, S/o.తెరపల్లి నాగభూషణం హిందు, వయస్సు: 37 సం॥లు, డోర్ నెం. 6-32/3/3, రెవెన్యూ వార్డ్-85, దానిబోయినపాలెం, స్టార్‌డమ్ స్కూల్ దగ్గర, అగనంపూడి, విశాఖపట్నం-53.

పైనెంబరు పిటీషన్‌లో పైతెలిపిన పిటీషనర్ గారు మీపై మెయింటినెన్స్ కొరకు పిటీషన్ దాఖలు చేసి యున్నారు. సదరు పిటీషన్ నందు కోర్టు ద్వారా పంపిన నోటీసులు మీరు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసి యున్నారు. కావున పైపిటీషన్‌లో మీ హాజరు కొరకు **తేది. 05-06-2025**న వాయిదా అయివున్నది. ఆ దినమున మీరు **ఉ॥గం॥10.30ని॥**లకు స్వయంగాగానీ, వకీలు ద్వారా గాని పైతెలిపిన శ్రీ కోర్టులో హాజరై మీఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పైపిటీషన్‌లో మీకుఎటువంటి ఆక్షేపణలు లేవనిభావించి శ్రీ కోర్టువారు మీ పరోక్షమందు తీర్మాణించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది. (By order of the Hon'ble Court)

VENNELA ESWARA RAO & M.V. SASHIBHUSHANA RAO
Advocates Gajuwaka, Visakhapatnam

పిసిఒఎస్ సమస్య పోషకాహారంతో పరిష్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఒఎస్) ప్రపంచ వ్యాప్తంగా మహిళలను అధికంగా ప్రభావితం చేస్తోందని, ఆరోగ్యకరమైన అల్పాహార ఎంపికల ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చునని మ్యాక్స్ హెల్త్‌కేర్ రీజనల్ హెడ్, పౌష్టికాహార నిపుణురాలు రితికా సమద్దర్ అన్నారు. గురువారం ఉదయం బీచ్ రోడ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పిసిఒఎస్‌తో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడటం వల్ల మొత్తం ఆరోగ్యం, జీవక్రియ, బరువు ప్రభావితమవుతాయని తెలిపారు. తృణధాన్యాలు, ఆకుకూరలు, బాదం వంటి పదార్థాలు తీసుకోవటం ద్వారా హార్మోన్ల సమతుల్యత, బరువు నియంత్రణ పొందవచ్చునని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో కొండా రాజీవ్ గాంధీకి గాయాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, విశాఖ జిల్లా నాయకులు కొండా రాజీవ్ గాంధీ గురువారం మధ్యాహ్నం తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వైసిపి నగర నాయకులు అందజేసిన సమాచారం ప్రకారం.. బస్సును తప్పించే క్రమంలో డివైడర్‌ను కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాజీవ్ గాంధీతో పాటు ఆయన తల్లి, భార్యకు కూడా గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో రాజీవ్ గాంధీ, ఆయన తల్లి, భార్య కారు వెనుక సీట్లో కూర్చున్నారు. గాయపడ్డ వారిని తిరువన్నమలైలోని ఆసుపత్రికి చేర్చారు. ముక్కుకు సర్జరీ చేస్తున్నట్లు తెలిసింది.

ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లకు కౌన్సెలింగ్

రంపచోడవరం : రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలోని 8 (బాలురు-4, బాలికలు-4) గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 1030 సీట్లకు (బాలురు-540, బాలికలు-490) అడ్మిషన్ కౌన్సెలింగ్ ఈ నెల 24న శనివారం ఉదయం 9గంటల నుండి నిర్వహించనున్నట్లు ఇరు ఐటిడిఎల ప్రాజెక్టు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు రంపచోడవరం గురుకుల బాలికల కళాశాల, బాలురకు రంపచోడవరం గురుకుల బాలుర కళాశాలలో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మార్కుల మెరిట్ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించబడతాయి.

గ్రామ పంచాయతీ కార్యాలయం - రేఖవానిపాలెం

రేఖా నెం. 10/2025 | టెండరు ప్రకటన | తేదీ.22-05-2025

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, రేఖవానిపాలెం గ్రామపంచాయతీ నందు దిగువ షెడ్యూలు నందుదహరించిన పనులను 2025-26 సం॥నకు కాంట్రాక్టు పద్ధతిపై చేయుటకు పనివార్లి సప్లయి చేయుటకు తేది: 26-05-2025 ఉదయం గం॥ 11ల వరకు రేఖవానిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం నందు ఈ దిగువ సంతకందారునిచే గాని, వారి అనుమతి పొందిన ఇతర ఉద్యోగిచే గాని సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం. 2.00లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరవబడును. టెండర్లలో పాల్గొనదలచిన వారు టెండరు ధరావత్తు చెల్లించి, టెండరు షరతులకు లోబడి టెండర్లలో పాల్గొనవలెను.

షెడ్యూలు

వ.నెం.	వివరములు		ధరావత్తు రూ॥లు
1.	ప్రజారోగ్య పారిశుధ్యపనులు నిర్వహణ	- 05	2000/-
2.	వీధిలైట్ల నిర్వహణ & బిగింపు పనులు	- 01	
3.	మంచినీటి సరఫరా స్కీములు నిర్వహణ	- 07	
4.	ఆఫీస్ స్వీపర్ కం అటెండర్	- 01	
5.	ప్లంబర్	- 01	

గమనిక : (1) పై పనుల యొక్క టెండర్లు శ్రీ జిల్లా కలెక్టర్ (పం.వి) విశాఖపట్నం వారి అనుమతికి లోబడి ఖరారు చేయుట మరియు కాంట్రాక్టు పనులకు చెల్లింపులు చేయుట జరుగును. (2) టెండర్లు ఎట్టి కారణం చూపి గానీ, చూపకుండా గానీ, రద్దు పరుచుటకు, వాయిదా వేయుటకు, తిరస్కరించుటకు గ్రామపంచాయతీకి పూర్తి అధికారము కలదు.

సం/- ఆదిరెడ్డి గాయిత్రి, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, రేఖవానిపాలెం భీమునిపట్నం మండలం

సం/- సమ్మిడి శ్రీనివాసరావు, సర్పంచ్ గ్రామపంచాయతీ, రేఖవానిపాలెం భీమునిపట్నం మండలం

యూనియన్ బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- పద్మనాభం : యూనియన్ బ్యాంకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ నరసింహకుమార్ అన్నారు. గురువారం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలోనివెలుగు కార్యాలయంలో బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. పద్మనాభం యూనియన్‌బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలో ఉన్న పద్మనాభం బ్రాంచిలో వ్యవసాయ రుణాలిచ్చేందుకు ఎక్కువగా అవకాశం ఉందని, వాటిని అర్హులంతా వినియోగించు కోవాలన్నారు. పంట రుణం తీసుకున్న రైతులు ఏడాదిలోపు చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తుందని, లేకుంటే నాలుగుశాతం అదనపువడ్డీని రుణగ్రహీతలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. డ్వాక్రా మహిళా గ్రూపులకు

మాట్లాడుతున్న బ్యాంకు రీజనల్ మేనేజర్ నరసింహకుమార్

రుణపరిమితిని రూ.10లక్షల నుంచి రెట్టింపు చేసి రూ.20లక్షలకు పెంచామన్నారు. మహిళా గ్రూపు సభ్యులకు వ్యక్తిగత రుణాలను రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షలకు పెంచామని, వీటిని వినియోగించుకోవాలన్నారు. పద్మనాభం బ్రాంచిలో 470 మహిళా సంఘ గ్రూపులకు రూ. 60 కోట్లు వరకు రుణాలిచ్చామన్నారు. డ్వాక్రా వ్యవసాయ రుణాలతోపాటు డెయిరీ, జీవాల పెంపకం యూనిట్లకు రుణం ఇస్తామ న్నారు. ఆధునిక వ్యవసాయ పనిముట్ల కొనుగోలుకు రుణాలిస్తామన్నారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ సభ్యరైతులు 15మందికి రూ.20లక్షలు విలువైన రుణ చెక్కులను పంపిణీ చేశారు. బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ పద్మనాభం యూనియన్ బ్యాంకులో రూ.1.35 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని రూ. 30 కోట్ల డిపాజిట్లు ఉన్నాయ న్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు కె. నగేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఎం.వెంకటాచలం, వెలుగు ఎపి సత్యంనాయుడు ఎపిఎం సాయి రమేష్ పాల్గొన్నారు.

మొబైల్ బృందాలతో ఎయిడ్స్‌పై అవగాహన

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఐసిటిసి బృందాలు

ప్రజాశక్తి -ఆనందపురం/ పద్మనాభం: మండలాల్లోని బోని, మద్ది గ్రామాలలో మొబైల్ బృందాలతో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ టీమ్, మొబైల్ ఐసిటిసి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో 52మందికి ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు చేశారు. మొబైల్ ఐసిటిసి కౌన్సిలర్ అర్జున్ మాట్లాడుతూ హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, గర్భిణులు తప్పనిసరిగా రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌టి కిషోర్ కుమార్ లింక్ వర్కర్ ఎం.జ్యోతి, ఎఎన్‌ఎం పుష్పలత, బాజియా కె.లక్ష్మి, వెంకటలక్ష్మి, కొండమ్మ, గంగమ్మ, నారాయణమ్మ, అంగన్వాడీ కార్యకర్త చిన్నతల్లి పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే జలమయం

చెరువును తలపిస్తున్న ముసలయ్య పాలెం మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి-మధురవాడ : బీచ్ నుండి ముసలయ్య పాలెం రోడ్డు బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువును తలపించేలా జలమయమైంది. నిత్యం ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో నీరు నిలిచి గోతులేర్పడిన రోడ్డులో ప్రయాణానికి వారంతా ఇబ్బందులు పడే పరిస్థితులున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పూర్తిస్థాయిలో డ్రైనేజీ నిర్మాణం ద్వారా వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడంతోపాటు, ప్రస్తుతం ఈ మార్గంలో ఉన్న గోతులకు తక్షణ మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

25న గీతం బిజినెస్ స్కూల్ ప్రవేశ పరీక్ష

- ఎపి మెడ్‌టెక్ జోన్‌తో కలసి ఎంబిఎ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు

ప్రజాశక్తి-మధురవాడ: గీతం వర్సిటీకి అనుబంధంగా ఉన్న గీతం బిజినెస్ స్కూల్ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో నిర్వహిస్తున్న గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్ మేనేజ్‌మెంట్ కోర్సులలో ప్రవేశాలకు జాతీయస్థాయి ప్రవేశపరీక్ష (జిబాట్)ను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. గురువారం గీతంలో మీడియాతో మాట్లాడుతూ,న గీతం బిజినెస్ స్కూల్ ద్వారా యుజి స్థాయిలో బికామ్, బిబిఎ (బిజినెస్ ఎనలిటిక్స్) బిబిఎ (ఫైనాన్సియల్ మార్కెట్స్), జనరల్ బిబిఎ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు.. పిజి స్థాయిలో ఎంబిఎ కోర్సుతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యతదృష్ట్యా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్, అకాడమి ఆఫ్ హస్పిటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబిఎ హస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తరగతి గది బోధనతో పాటు వైద్య రంగంలో అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ అనుభవాలను జోడిస్తూ ఈ కోర్సును రూపొందించామన్నారు. ఏదైనాగుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ

వివరాలు వెల్లడిస్తున్న గీతం బిజినెస్ డీన్ రాజా ఫణిపప్పు

తత్సమాన కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఆసక్తిగత విద్యార్థులు ఈ ప్రవేశపరీక్షకు అర్హులని, జిబాట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. గీతం బిజినెస్ స్కూల్లో ఎంబిఎ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఐసిఐపి కార్యక్రమంలో భాగంగా తొమ్మిది నెలల పాటు వివిధ అంశాలపై అధ్యయనానికి అమెరికా, యుకెలలోని భాగస్వామ్య విశ్వవిద్యాలయాల్లో పర్యటించేలా ఒప్పందం కుదిరిందన్నారు.

మాదిగలకు అన్యాయం చేస్తే ఊరుకోం

ప్రజాశక్తి- సీతమ్మధార/ విశాఖ కలెక్టరేట్: ఎస్‌సి వర్గీకరణలో మాదిగలకు అన్యాయం చేస్తే సహించేది లేదని, ఆందోళన చేస్తామని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం ప్రయివేటు హోటల్‌లో పెద్దాడ రమణ అధ్యక్షతన విలేకరులతో మాట్లాడుతూ 'రిజర్వేషన్ల సక్రమంగా అందని కులాలకి వర్గీకరణ మొదటి వరసలో ప్రాధాన్యతనివ్వాలన్న సుప్రీం కోర్టు సూచనలకు భిన్నంగా వర్గీకరణ రోస్టర్ పాయింట్ల పేరుతో మాలలకు 8శాతం, మాదిగలకు 6శాతం రిజర్వేషన్లు ఇస్తామని చంద్రబాబు చెప్పడం ఎక్కడి సామాజిక న్యాయమని ఆరోపించారు. టిడిపి విజయానికి మాదిగలు కృషిచేస్తే, మాలలకు పెద్దపీట వేసి చంద్రబాబు మోసగించారన్నారు. తెలంగాణలో మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అక్కడి సిఎం రేవంత్‌రెడ్డిని అడిగిన మందా కృష్ణమాదిగ, ఆంధ్రాలో ఆరుశాతమే ఇస్తామన్న చంద్రబాబును ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. స్వార్థ ప్రయోజనాల

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కోసం 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమాన్ని చంద్రబాబుకు అమ్ముకుని, మాలలతో రాజీ ఒప్పందం కుదుర్చుకుని ఆంధ్రా మాదిగలకు మందా కృష్ణ అన్యాయం చేస్తున్నారన్నారు. వర్గీకరణ సంబరాలు జరుపుకోవాలని ఆయన పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. మాదిగల రిజర్వేషన్‌కు పోరాడుతున్న పెద్దాడ రమణకు ప్రభుత్వం పదవినిచ్చి గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపిఎంఆర్‌పిఎస్ నేతలు గంట్యాడ ఆదినారాయణ,పెద్దాడ రాజు పాల్గొన్నారు.

ఔషధ పరిశ్రమల్లో మహిళలకు పెద్దపీట

ప్రజాశక్తి-మధురవాడ : ఔషధ పరిశ్రమల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచడమే లక్ష్యంగా ఫైజర్, గీతం వర్సిటీతో భాగస్వామ్యం చేసుకుంది. ఈ మేరకు ఫైజర్ ఉద్యోగులుగా ఉండి, గీతం వర్సిటీలో మైక్రోబయాలజీ స్పెషలైజేషన్‌తో బిఎస్‌సి కెమెస్ట్రీ 36నెలల డిగ్రీ కోర్సు పూర్తి చేసుకున్న 44మంది మహిళలతో కూడిన 'ఫైజర్ అటానమస్ టీమ్' (పిఎటి) మొదటి బ్యాచ్ గురువారం రిలీవయ్యారు. ఇకనుంచి వారంతా ఫైజర్ ఔషధ పరిశ్రమలో రెగ్యులర్ ఉద్యోగులుగా కొనసాగనున్నారు. ప్రస్తుతం, విశాఖపట్నం ఫైజర్ తయారీ యూనిట్‌లో 340 మందికి పైగా మహిళా విద్యార్థులు పిఎటి ప్రోగ్రామ్‌లో భాగమయ్యారు. ఈసందర్భంగా ఫైజర్ వైస్ ప్రెసిడెంట్ (సైట్ హెడ్) బి.మురళీధర్‌శర్మ మాట్లాడుతూ, పిఎటి ప్రోగ్రాం ద్వారా 44మంది మహిళా విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తమ విద్యార్థులకు అత్యంత అభ్యాస అనుభవాలను అందించిన గీతం వర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. గీతం వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఎర్రోల్ డిసౌజా మాట్లాడుతూ, గీతం, ఫైజర్ సంయుక్తంగా రూపొందించిన పాఠ్యాంశాలలో పరిశ్రమకు కావాల్సిన తాజా సాంకేతిక నైపుణ్యాలతో యువతులను సిద్ధం చేసి అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆసియా-పసిఫిక్, ఆఫ్రికా,మిడిల్ ఈస్ట్ రీజియన్‌లోని పీపుల్ ఎక్స్‌పీరియన్స్, ఫైజర్ గ్లోబల్ సప్లై సీనియర్ డైరెక్టర్ రేష్మా పరిదా, జిఐఎస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి, పిజిఎస్ ఇండియా పీపుల్ ఎక్స్‌పీరియన్స్ డైరెక్టర్ టి.రవికిరణ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇంటి స్థల వివాదంలో చాకుతో దాడి

ప్రజాశక్తి-ఆనందపురం: జగనన్న ఇంటి స్థలం విషయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదంలో ఓ వ్యక్తి చాకుతో దాడిచేసిన ఘటన ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.

మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ నేలతేరు గ్రామంలో బుధవారం రాత్రి జగనన్న ఇళ్ల స్థలం విషయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదం చోటుచేసుకుంది. నేలతేరు గ్రామానికి చెందినఆదిలక్ష్మి కి 20 ఏళ్ల క్రితం ఇంటి లక్ష్మణరావుతో వివాహమైంది. వీరికి కార్తీక్ అనే కుమారుడు ఉన్నారు. ఏడేళ్ల క్రితం భర్తతో మనస్పర్థలు కారణంగా ఆదిలక్ష్మి కుమారుడు కార్తీక్‌ను తీసుకొని విడిపోయి భోగాపురానికి చెందిన బోర సూరిబాబును పెళ్లిచేసుకుంది. వీరికి ఎల్‌వి.పాలెం జగనన్న కాలనీలో నివాసముంటున్నారు ఇటీవల ఆదిలక్ష్మి పేరిట ఇళ్లు రావడంతో దాన్ని కొడుకు కార్తీక్ పేరు మీద ఇంటిపట్టా రాయాలని ఘర్షణ పడ్డారు. దీనికి ఆదిలక్ష్మి, సూరిబాబు ఒప్పుకోకపోవడంతో ఏలూరులో ఉన్న తన తండ్రి లక్ష్మణరావుకు సమాచారం అందించాడు. లక్ష్మణరావు ముందు భార్య కుమారుడు మణికంఠను తీసుకుని నేలతేరు వచ్చి ఇంటి విషయమై సూరిబాబును ముగ్గురు నిలదీశారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సూరిబాబుపై మణికంఠ చాకుతో దాడి చేసి పొట్టలో పొడవడంతో తీవ్ర రక్తస్రావమై పడిపోయాడు. దీన్ని గమనించిన మణికంఠ, లక్ష్మణరావు, కార్తీక్ పరారయ్యారు సూరిబాబును విశాఖ కెజిహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. పరారైన వారి కోసం ఆనందపురం పోలీసులు గాలిస్తున్నారు సిఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు

కొత్త సిఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -ములగాడ: మల్కాపురం సిఐగా గొలగాని అప్పారావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ శాంతిభద్రతల విభాగంలో పనిచేస్తున్న ఆయనను మల్కాపురం బదిలీ చేయగా, ఇక్కడ సిఐ విద్యాసాగర్ ఎఆర్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సిఐ అప్పారావును పలువురు స్థానిక నేతలు అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, స్టేషన్ పరిధిలో అవాంఛనీయ ఘటనలకుఆస్కారం లేకుండా శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల రేటు తగ్గించేందుకు కృషి చేస్తానన్నారు.

గోపాలపట్నం: గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ శాంతి భద్రతల విభాగం సిఐగా ఎన్‌వి ప్రభాకరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా స్పెషల్ బ్రాంచ్ నుంచి గోపాలపట్నానికి బదిలీపై వచ్చారు. 2004 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ప్రభాకరరావు, 2012లో సిఐగా ప్రమోషన్ పొందగా, ఇంటిలిజెన్స్, ఈస్ట్ 2 ట్రాఫిక్, ఎయిర్‌పోర్టు స్టేషన్, లా అండ్ ఆర్డర్, పద్మనాభం, భోగాపురం, గజపతినగరం, సిఐడి విభాగాల్లో పనిచేశారు.కొత్త సిఐ ప్రభాకరరావును ఎస్ఐలు అప్పలనాయుడు, రామారావు, ఇతర సిబ్బంది స్వాగతించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం స్టేషన్‌లో సిబ్బందితో సమీక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట, అసాంఘిక చర్యలపై ఉక్కుపాదం, పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి పెడతానన్నారు. కాగా ఇక్కడ సిఐ జి.అప్పారావు మల్కాపురం బదిలీ అయ్యారు.

ముగ్గురు 'ఓపెన్' ఇంటర్ విద్యార్థుల డిబార్

ప్రజాశక్తి - ఆరిలోవ : భీమిలి మండలంలో ఒక పరీక్షా కేంద్రంలో ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు రాస్తుండగా, ముగ్గురు విద్యార్థులు మాల్ ప్రాక్టిస్ చేస్తూ స్క్వాడ్ బృందాల తనిఖీల్లో పట్టుబడ్డారని డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. వారిని అధికారులు డిబార్ చేశారన్నారు.

ప్రశాంతంగా పది సప్లమెంటరీ గణితం పరీక్ష

పదోతరగతి సప్లమెంటరీ గణితం పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగిందని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 2606 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 2204 మంది హాజరుకాగా, 402 మంది గైర్హాజరయ్యారు. తాను ఒక పరీక్షకేంద్రాన్ని, స్క్వాడ్ బృందాలు 17 కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేసినట్టు తెలిపారు. ఓపెన్ స్కూలు ఎస్‌ఎస్‌సి పరీక్షలు 9 కేంద్రాల్లో జర్గ్గా, గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వ పరీక్షలకు 512 మంది విద్యార్థులకు గాను 495 మంది పరీక్ష రాయగా, 57 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలు ఐదు కేంద్రాల్లో జర్గ్గా, భౌతికశాస్త్రం, రాజనీతిశాస్త్రం పరీక్షలకు 418 మంది విద్యార్థులకు గాను 368 మంది హాజరై, 50 మంది గైర్హాజరయ్యారు.

బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం

బిఎం ఉమాపతిని సత్కరిస్తున్న ఖాతాదారులు, సిబ్బంది

ప్రజాశక్తి- ఆనందపురం : బదిలీపై వెళుతున్న ఆనందపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఉమాపతిని గురువారం గ్రామస్తులు, ఖాతాదారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. 2022 జూన్‌లో ఆనందపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఉమాపతి, వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడంతో ఖాతాదారుల మన్ననలు పొందారు

ఈ సందర్భంగా విద్యావేత్త దొంతల రామారావు మాట్లాడుతూ, ఉద్యోగస్తులకు బదిలీలు సర్వసాధారణమని, పనిచేసిన చోట గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. మేనేజర్ ఉమాపతి మాట్లాడుతూ మూడేళ్ల పాటు ఆనందపురంలో పనిచేశానన్నారు. ఆరిలోవ బ్రాంచ్‌కు బదిలీ అయినట్లు తెలిపారు కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ శ్రీనివాసరావు, క్యాషియర్ కామేశ్వరరావు, సిబ్బంది రాజ్‌నాయక్, ఆర్‌డి సుజన, మాజీ సర్పంచ్ శ్రీనాథ్ నారాయణ రావు, దొంతల రామారావు, కె. నారాయణరావు, కొట్యాడ రెడ్డిబాబు, కోరాడ రమణ, దొంతల ఆచ్చన్న పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు అభినందన

గోవిందరెడ్డిని సత్కరిస్తున్న భాస్కరరావు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి డిప్యూటీ మేయర్‌గా ఇటీవల కొత్తగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన దల్లి గోవింద రెడ్డిని గురువారం జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛమందించి, దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో కంపర కోటేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, బలిరెడ్డి శ్రీను, అట్టా శంకర్, పి. అనురాధ, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంతో ఆహార భద్రత

మాట్లాడుతున్న సుంకర చలపతిరావు

ప్రజాశక్తి -ములగాడ : జీవ వైవిధ్యందె ఆహార భద్రత ఏర్పడుతుందని, వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, పశు పోషణ, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి అన్నారు. గురువారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బాలల వేసవి శిక్షణా శిబిరంలో జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, ప్రకృతిలోని ప్రతి జీవికి విలువ ఉందని, వాటన్నింటినీ కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్య అతిథి కళారత్న సుంకర చలపతిరావు మాట్లాడుతూ, వాతావరణ మార్పులను తట్టుకునే శక్తి జీవ వైవిధ్యం ఇస్తుందన్నారు. ప్రతి వ్యక్తీ జీవ వైవిధ్యానికి భంగం కలిగించకుండా చూడాలన్నారు. ఎన్‌సిసి జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, ఎన్‌సిసి వాలంటీర్లు జ్యోతిర్మయి, సునీత, శ్రీశాంత్ పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణాలతో చెలగాటం!

● ఎన్ఎడిలో కూలిన భవనం భారీ గోడ ● తప్పిన పెను ప్రమాదం, ప్రాణాపాయం

ఎన్ఎడిలో కుప్పకూలిన భవనం భారీ గోడ

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎన్ఎడిలో పనిచేస్తున్న కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వర్తిస్తున్నారు. 1940 దశకంలో నిర్మించిన పలు భవనాలు, వర్క్‌షాప్‌లు భవనాలు, గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎపుడు, ఏ భవనం కూలుతుందో, ఏ గోడ పడిపోతుందో అన్న భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్ఎడి కార్మికులు భయపడ్డట్టే గురువారం ఉదయం 11గంటల సమయంలో స్టోర్ సెక్షన్ -5లో 1 నుంచి 3 భవనాలకు చెందిన అతి పెద్ద గోడ ఉన్నఫలానా కుప్పకూలిపోయింది. అయితే గోడ కూలిన సమయంలో అక్కడ కార్మికులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

. ఎన్ఎడిలో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని కార్మికులు వాపోతున్నారు. శిథిల భవనాల పునర్నిర్మాణం, ఇతర ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదనికార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిచేసే ప్రదేశాలలో భద్రతను కల్పించాల్సిన యాజమాన్యం నేటికీ నిర్లక్ష్యం వహిస్తూ, ఇప్పటికీ ఇలా పాడుబడిన భవనాలల్లోకి కార్మికులకు పంపి పనులు చేయిస్తున్నారని, వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వాపోతున్నారు. ఇటువంటివి ప్రశ్నిస్తున్నందునే యూనియన్ నాయకులపై యాజమాన్యం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, కార్మికుల ప్రాణాలకు రక్షణ, భరోసానిచ్చే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ శర్మ

డాక్టర్ డివిఎస్‌వై శర్మ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : నగరంలోని ఎల్ఐసి కార్యాలయంలో హైయర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ డివిఎస్‌వై శర్మ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు న్యాయనిర్ణేత (టెక్నికల్ ఆఫీషియల్)గా ఎంపికయ్యారు. ఈనెల 27 నుండి వచ్చేనెల15 వరకు అహ్మదాబాద్‌లో జరిగే అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యుటిటి) పోటీలకు, అలాగే వచ్చేనెల 24 నుంచి జూలై రెండు వరకు ఉజ్బెకిస్తాన్ దేశంలోని తాస్కంట్ నగరంలో జరిగే ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు న్యాయ నిర్ణీత (టెక్నికల్ అఫీషియల్)గా వ్యవహరించనున్నారు.

ఇటీవల కేరళలోని కొచ్చి లో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు శర్మను టెక్నికల్ డెలిగేటుగా ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ నియమించింది. ప్రస్తుతం ఆయన ఎల్ఐసిలో స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబర్‌గాను, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడిగాను, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శిగా తన సేవలను అందిస్తున్నారు. స్పోర్ట్స్ మేనేజ్మెంట్‌లో పిహెచ్‌డి చేసి డాక్టరేట్ అందుకున్న డాక్టర్ శర్మ, డెహ్రాడూన్‌లో జరిగిన నేషనల్ గేమ్స్‌కు వివిధ జాతి అంతర్జాతీయ పోటీలకు అంపైర్‌గా వ్యవహరించారు. ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ నుంచి బ్లూబ్యాడ్జి ఇంటర్నేషనల్ అంపైర్‌గా అర్హత సాధించిన 11 మందిలో డాక్టర్ శర్మ ఒకరు. స్వతహాగా టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడైన డాక్టర్ శర్మ గత ఏడాది హైదరాబాదులో జరిగిన కామన్వెల్త్ మాస్టర్ ఇంటర్నేషనల్ పోటీల్లో రజతపతకం సాధించారు. ఎల్ఐసి జాతీయ క్రీడలలో ఛాంపియన్‌గా నిలిచారు ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ నిర్వహించిన లెవెల్ -1, లెవెల్ -2 కోచ్ పరీక్షలలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులై క్వాలిఫైడ్ కోచ్‌గా అర్హత సాధించి జపాన్‌లో జరిగిన పోటీలలో భారత జట్టుకు కోచ్ వ్యవహరించారు. ఇటీవల హాంకాంగ్, సింగపూర్, బ్యాంకాక్ , మయన్మార్, నేపాల్, దావోస్ దేశాలలో జరిగిన పోటీలకు ఇంటర్నేషనల్ అంపైర్‌గా విధులు నిర్వహించారు.

శుద్ధి చేసిన తాగునీటిని అందించాలి

● జివిఎంసి నీటి సరఫరా విభాగపు అధికారులతో సమీక్షలో నగర మేయర్ పీలా

జివిఎంసి నీటిసరఫరా ఇంజినీర్లుతో సమీక్షలో మేయర్ పీలా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖ నగరానికి తాగునీరు అందిస్తున్న నీటి రిజర్వాయర్లను నిత్యం సందర్శిస్తూ, వాటి పంప్ హౌస్‌లను, నీటి నాణ్యతను తనిఖీలు నిర్వహిస్తూ శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించేలా నీటి సరఫరా విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జివిఎంసి తాగునీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో సంబంధిత విభాగం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు తాగునీటిని అందించే ప్రధాన వనరులైన ఏలేరు, తాటిపూడి, రైవాడ, గోస్తని, ముడసర్లోవ, మేఘాద్రి గెడ్డ, శారదానదుల నుంచి రోజువారీ నగర ప్రజలకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఎంత నీరు సరఫరా అవుతుందని, వాటి నిర్వహణ ఖర్చులపై ఆరా తీశారు. సమీక్షా సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు కె.శివప్రసాదరాజు, పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎన్ రవి, కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకష్ణ, సుధాకర్, శ్రీనివాస్ ప్రసాద్, ఉపకార్య నిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-మధురవాడ : పిఎంపాలెం సెక్షన్‌లోని 33/11కెవి సబ్ స్టేషన్‌లో 11కెవి పెప్సీ ఫీడర్ విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మలు కత్తిరింపు, ఇతర నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 23న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ , మూడవ జోన్ ఆపరేషన్స్ విభాగం ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. దీంతో బబ్బులమ్మ గుడి ఏరియా, విజేత సూపర్ మార్కెట్ రోడ్డు, కారుషెడ్ ఏరియా, ఓల్డ్ పెప్సీ కంపెనీ ఏరియా, పిలకవానిపాలెం, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, .వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో అసంబద్ధాలను సరిచేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో అసంబద్ధాలను వెంటనే సరిచేసి, ఉపాధ్యాయులలో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశరర్రావు, టి.ఆర్.అంబేడ్కర్‌లు ఒక ప్రకటనలో కోరారు. దీనికోసం విద్యాశాకాధికారులు తగు చర్యలు తీసుకోవాలని, బదిలీ నిబంధనలను నిర్ధిష్టంగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో చర్చలు సందర్భంగా పేర్కొన్న అంశాలకు భిన్నంగా అధికారులు వ్యవహరించడం సరికాదని, పూటకో మాట రోజుకో విధానం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వెలిబుచ్చారు. బదిలీల నిబంధనలను సక్రమంగా అమలు చేయకుంటే మళ్లీ ఉద్యమబాట పట్టక తప్పదని హెచ్చరించారు.

మాజీ సర్పంచ్‌కు సత్కారం

జోగి నాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని లక్ష్మీపురం మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు కరుభ క్త జోగినాయుడును గురువారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విశాఖ నగరం ఎంవిపి కాలనీలోని తన నివాసంలో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మూడు దఫాలు సర్పంచ్‌గా బాధ్యతుల నిర్వహించి, పంచాయతీ అభివృద్ధికి జోగినాయుడు చేసిన కృషిని ఎమ్మెల్యే గంటా ప్రస్తావించి అభినందించారు.75 ఏళ్ల వయసులోనూ పంచాయతీ అభివృద్ధికి జోగినాయుడు తాపత్రయ పడడాన్ని ప్రశంసించారు.ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి జోగినాయుడు వినతిపత్రం అందజేయగా, ఎమ్మెల్యే గంటా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు గాడు తాతినాయుడు, మాజీ ఎంపిటిసిలు ఎం పైడినాయుడు, కె వెంకటరావు, మాజీ ఉప సర్పంచ్ బంగారు నాయుడు తెలిపారు

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి - ఆనందపురం:: నవధాన్యాల సాగుతో నేల సారవంతమౌతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం హెచ్‌ఆర్ శ్రీనివాస చక్రవర్తి అన్నారు. గురువారం తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులందరూ నవధాన్యాల సాగుతోనేల ఆరోగ్యంతో పాటు, ప్రధాన పంటలకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు పిఎండిఎస్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం మండల సిబ్బంది ఎంఎంటిఎల్ రామారావు, తర్లువాడ యూనిట్ ఇన్‌ఛార్జి పైడిరాజు, ఐసిఆర్‌పి మజ్జి కృష్ణవేణి , ప్రకృతి వ్యవసాయ సాగు రైతులు పాల్గొన్నారు.

పద్మనాభం : రైతులు వేసవి దుక్కులో నవధాన్యాలు సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటను సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయవిభాగం నార్త్ కోస్టల్ రీజినల్ టెక్నికల్ లీడ్ ప్రకాష్ అన్నారు. గురువారం కోరాడ, కురవల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. కోరాడలో రైతులకు పిఎండిఎస్ కిట్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మావలోకనంలో టిడిపి నేతలు

ఎమ్మెల్యేలదే అంతిమ నిర్ణయమని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తేల్చి చెప్పడంతో ఖంగుతిన్న తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - యలమంచిలి

కూటమి పార్టీల మధ్య ఆధిపత్య పోరు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యేలదే తుది నిర్ణయమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ తేల్చి చెప్పడంతో యలమంచిలిలో వంటి చోట్ల తెలుగుతమ్ముళ్లు ఖంగుతిన్నారు. విశాఖలోని విఎంఆర్డీఏ కార్యాలయంలో బుధవారం మంత్రి నారాయణ నిర్వహించిన సమీక్షా సమావేశంలో తెలుగుదేశం పెందుర్తి, యలమంచిలి నియోజకవర్గాల ఇన్‌చార్జులు గండి బాబ్జీ, ప్రగడ నాగేశ్వరరావులకు తీవ్ర అవమానమే ఎదురైంది. అభివృద్ధి పనులు చేపట్టడంలో ఎమ్మెల్యేలతో పాటు అధికార పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా ఉన్న టిడిపి నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేయడంతో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కలుగజేసుకొని పార్టీ ఇన్‌చార్జులు సూచనలు, సలహాలు మాత్రమే ఇవ్వవచ్చని, అంతిమ నిర్ణయం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలదేనని కుండబద్దలు కొట్టారు. దీంతో జనసేన, బిజెపి ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో తెలుగుదేశం నాయకులు అయోమయంలో పడ్డారు.

కూటమి ప్రభుత్వంలో యలమంచిలి నియోజకవర్గం ఎమ్మెల్యేగా జనసేన నేత సుందరపు విజయకుమార్ ఉండగా, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రగడ నాగేశ్వరరావు ఉన్నారు. నిన్న మొన్నటిదాకా ఎవరి

సుందరపు విజయ్‌కుమార్, ప్రగడ నాగేశ్వరరావు

రాజకీయాలు వారు చేసుకుంటున్నారు. అయితే ఎమ్మెల్యే వ్యవహారశైలి వల్ల చాపకింద నీరులా తెలుగుదేశంలో అసంతృప్తి పెరుగుతూవచ్చింది.

ఇది ఇలా ఉండగా.., 50 శాతం ఎమ్మెల్యేను తానేనంటూ యలమంచిలి నియోజకవర్గంలో ప్రగడ నాగేశ్వరరావు చెప్పుకోవడం ఏమిటని ఈ సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నిలదీశారు. అయినా ఎమ్మెల్యేల సమావేశానికి టిడిపి ఇన్‌చార్జులను పిలవడమేమిటని ప్రశ్నించడంతో స్పీకర్ అయ్యన్న పాత్రుడితో సహా కొందరు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ కలుగ జేసుకొని ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జుల పాత్రలపై స్పష్టమైన లక్ష్మణరేఖ గీశారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జుల పాత్ర సూచనలు, సలహాలు ఇవ్వడం వరకే పరిమితమని, అంతిమ నిర్ణయం మాత్రం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.

ఈ నిర్ణయం మింగుడు పడని యలమంచిలి నియోజకవర్గ తెలుగు తమ్ముళ్ల పునరాలోచనలో పడ్డారు. రాబోయే నాలుగేళ్లు జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కనుసన్నల్లోనే పనులన్నీ జరిగితే తెలుగుదేశంలో ఉండి ప్రయోజనం ఏమిటని ఆత్మావలోకనంలో పడ్డారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి తెలుగుతమ్ముళ్లను రక్షించుకోవడం ఎలా అన్న మీమాంసలో నియోజకవర్గ నాయకులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇంత వరకూ చాపకింద నీరులా సాగిన జనసేన, తెలుగుదేశం నాయకుల అసంతృప్తులు బట్టబయలు కావడంతో ముందు ముందు ఏం జరుగుతుందోనని ఇరు పార్టీ కార్యకర్తల్లో ఆసక్తి నెలకొంది. మరికొన్ని రోజుల్లో కూటమి పార్టీల పొత్తుపై ఆసక్తి నిర్ణయాలు వెలువడే అవకాశాలుంటాయని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి క్షేత్ర స్థాయిలో ఎదురు దెబ్బగానే విశ్లేషిస్తున్నారు.

రాళ్లు,ఎర్రటి క్లాత్‌తో హెచ్చరిక ఏర్పాటు చేసిన దృశ్యం

కల్వర్టు వద్ద ప్రమాదకరంగా రంధ్రం

- మరమ్మతులకు ఎంపిడిఒ ఆదేశం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం-అనకాపల్లి మార్గంలో విశాఖ డెయిరీ బల్క్ కూలింగ్ సెంటర్ సమీపంలో రోడ్డు కల్వర్టు వద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాన్ని సాగిస్తున్నారు. తెలియని వారు రంధ్రంలో వాహనం దిగి గాయాలు పాలైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపిడీవో ఆంజనేయులు గురువారం పరిశీలించి ఆర్ అండ్ బి అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించి రంధ్రానికి ఇరువైపులా రాళ్లు ఏర్పాటు చేసి ఎర్రటి క్లాత్ జండాలను తాత్కాలికంగా కట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో నారాయణరావు, వార్డు సభ్యులు టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు అప్పలనాయుడు

తల్లీపిల్లల ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో తల్లీపిల్లల ఆసుపత్రి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని తల్లీపిల్లల ఆసుపత్రి ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు స్త్రీల వైద్యనిపుణులు డాక్టర్ రోజా రాణి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ఆధునిక పరికరాలతో చికిత్స అందజేయడం జరుగుతుందన్నారు. స్త్రీలకు సంబంధించి ఎలాంటి సమస్య అయినా అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడు విజయ్‌ను సత్కరిస్తున్న మంత్రి అనిత

విజయ్‌ను సత్కరించిన హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -మునగపాక : టిడిపి మండల నూతన అధ్యక్షుడిగా నియమితులైన పెంటకోట విజయ్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరంలో మంగళవారం జరిగిన టిడిపి మినీ మహానాడులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో మంత్రి అనిత విజయ్‌ను దుస్సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, ధూళి రంగనాయుకులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, జానకి, మాలతి, ఎస్.రాము, ఉల్లింగల సంతోష్, దాడి శివ, పెంటకోట శ్రీరామూర్తి, శంకర్, ఎంవిఆర్ నాయుడు, వి నర్సింగరావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష పోస్టులకు గైడ్‌లైన్స్ ప్రకారం ఎంపిక చేయాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 7న సమగ్ర శిక్ష అనకాపల్లి జిల్లా అదనపు పథక సమన్వయకర్త విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సూచించిన సెక్టోరియల్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్, ఏఎస్ఓ, జిసిడిఓ పోస్టులు సమగ్ర శిక్ష గైడ్‌లైన్స్ ప్రకారం పరీక్ష పెట్టి, ఇంటర్వ్యూ ద్వారా సెలెక్ట్ చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. ఈ మేరకు గురువారం సమగ్ర శిక్ష కార్యాలయంలో సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆర్ జయ ప్రకాష్కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి అనకాపల్లి జిల్లా ఏర్పాటైన సందర్భంలో సమగ్ర శిక్ష అభియాన్‌లో పేర్కొన్న పోస్టులకు తాత్కాలికంగా ఉపాధ్యాయులను నియమించుకోవడం జరిగిందని తెలిపారు. అయితే ఇప్పుడు ఆయా పోస్టులను నింపడానికి ఫారిన్ సర్వీస్ పద్ధతిలో నియమించుటకు ఇచ్చిన నోటిఫికేషన్ సంతోషకరమే అయినప్పటికీ ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా దరఖాస్తుదారులను పరీక్ష పెట్టి ఇంటర్వ్యూ ద్వారా నియమించాలని కోరారు. దీనిపై ఏపిసి స్పందిస్తూ ఖాళీ అయిన ప్రతి పోస్టును సమగ్ర శిక్ష గైడ్లెన్స్ ప్రకారం నింపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఎస్ ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు, సీనియర్ నాయకులు రేబాక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు చిన్నబ్బాయి తదితరులు

వర్షాలతో నువ్వు పంటకు నష్టం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అకాలంగా వర్షాలు పడడంతో నువ్వు పంటకు నష్టం వాటిల్లింది. కోసిన నువ్వు పంటను ఎండబెట్టడానికి అవకాశం లేకుండా రోజువారి వర్షం పడుతుంది. గత్యంతరం లేని రైతన్నలు కాసింత ఎండ కాసిన కల్లాలపై కోసిన నువ్వు పంటను ఆరబెడుతున్నారు. రోజు వర్షం పడడంతో కుప్పలలోకి వర్షం నీరు చేరి గింజలకు మొక్కలు వస్తున్నాయి. మండలములో హరిపాలెం, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట, ఎం జగన్నాధపురం తదితర గ్రామాలలో రెండు వందల ఎకరాల విస్తీర్ణంలో నువ్వు పంటను నాటారు. సగం విస్తీర్ణంలో నువ్వు పంట పండిన వర్షం దెబ్బతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి నువ్వు రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు విజ్ఞప్తి చేశారు.

వర్షాలకు తడిసిపోయి మొక్కలు వస్తున్న నువ్వుచేను

బిజెపి హయాంలో మహిళలపై పెరిగిన దాడులు

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి-అనకాపల్లి : బిజెపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల మీద దాడులు, హింస పెరిగాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి తెలిపారు. గురువారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 24, 25, 26 తేదీల్లో అనకాపల్లి జిల్లా తిమ్మరాజుపేట గ్రామంలో రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు జరగనున్నాయని, దీనికి రాష్ట్ర నలుమూలల నుండి 300 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. మూడు రోజులపాటు వివిధ రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాల పట్ల మహిళకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దేశంలో మహిళల పట్ల వివక్షత, హింస నానాటికి పెరుగుతుందన్నారు. దేశంలో సాగిన అనేక పోరాటాల ఫలితం గానే రాజ్యాంగంలో మహిళలకు హక్కులు కల్పించడం జరిగిందన్నారు. ఆజాదీ కా అమృత ఉత్సవాలు జరుపుకుంటున్న దేశంలో స్త్రీలకు ఒరిగిందేమీ లేదన్నారు. మహిళల మీద దారుణాలకు పాల్పడిన వారు నిర్దోషులుగా చలామణి అవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి

ఐద్వా రాష్ట్ర నాయకులు పద్మ, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. మాణిక్యం, డి.డి.వరలక్ష్మి , రొంగలి లక్ష్మి , వాణి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగ సాగుతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి-బుచ్చయ్య పేట : .మునగ సాగు రైతులకు సిరులు కురిపిస్తోందని డిపిఎం ప్రసాద్ తెలిపారు. గురువారం బుచ్చయ్యపేట వెలుగు కార్యాలయంలో రైతులకు మునగ సాగుపై అవగాహన కల్పించారు. జిల్లాలో బుచ్చయ్యపేట, గొలుగొండ మండలాలను మునగ ఆకు సాగుకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారన్నారు. ఈ మండలంలో 100 ఎకరాలు సాగు లక్ష్యంగా నిర్ణయించమని తెలిపారు. విత్తనాలను తమిళనాడు నుండి తీసుకువస్తామన్నారు. మునగ ఆకు సాగుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయనిచెప్పారు. ఒక ఎకరాకి రూ.5 లక్షల నుండి రూ.7లక్షల వరకు ఆదాయం పొందవచ్చని చెప్పారు. రైతులు ఉత్పత్తి చేసిన మునగ ఆకునుగా మార్చి మార్కెటింగ్ చేసేందుకు యంత్రాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీఎంలు రాజబాబు, జగన్, రైతులు రైతు మిత్ర సభ్యులు పాల్గొన్నారు.

రైతులు నీటి తీరువా చెల్లించాలి

ప్రజాశక్తి -బుచ్చయ్య పేట : రైతులు నీటి తీరువా పన్ను చెల్లించాలని బుచ్చయ్యపేట మండల తహసీల్దార్ ఎం.లక్ష్మి విజ్ఞప్తి చేశారు. మండలంలోని పెదపూడి, తురకలపూడి, చిన్నప్పన్న పాలెం, ఆర్.భీమవరం, పోలేపల్లి, పెదపూడి అగ్రహారం, మంగళాపురం, గంటి కొర్లం, విజయరామరాజుపేట, వడ్డాది గ్రామాలలో రైతులు నీటి తీరువా చెల్లించాల్సి ఉందన్నారు. డిమాండ్ నోటీసు అందించిన పది రోజుల్లోపు సంబంధిత సచివాలయాలలో ఆన్లైన్లో పన్ను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆలస్యమైతే అదనపు రుసుముతో చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అక్రమ నిర్మాణాలపై నోటీసులిస్తాం

ప్రజాశక్తి -బుచ్చయ్య పేట : మండలంలోని రాజాం జంక్షన్లో చెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలకు నోటీసులు అందిస్తామని బుచ్చయ్యపేట తహసీల్దార్ ఎం.లక్ష్మీ తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. చెరువు గట్టుపై కొంతమంది సుదీర్ఘకాలంగా ఆక్రమణలకు పాల్పడి శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు, కొంతమంది వాణిజ్య కట్టడాలు చేపట్టారని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ సర్వే చేయించి ఆక్రమణదారులను తొలగిస్తామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని వారాడ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం ఈ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ అధికారి ఎం చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని వారాడ, ఆర్వై అగ్రహారం, ఆనందపురం, కొరువాడ, పింద్రంగి, కేజే పురం, గవరపాలెం, వి.సంతపాలెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని చంద్రశేఖర్ కోరారు.

సంపద కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి-కశింకోట : చెత్తతో సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం, బయ్యవరం గ్రామపంచాయతీల పరిధిలోగల చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిరీషారాణి మాట్లాడుతూ చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలన్నారు. ఆదాయంతో పంచాయతీలో అభివృద్ధి పనులకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీఓ ఎం.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు ఎన్.సత్యారావు, డి.బాబురావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ

యోగాంధ్రాలో ప్రజలు భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు గ్రామ, వార్డు, మండలం, జిల్లా కేంద్రంలో ప్రతి రోజు యోగాంధ్రా-2025 కార్యక్రమాలను నిర్వహించాలని, ఇందులో ప్రజలను భాగస్వామలులను చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలు నుండి గురువారం "యోగాంధ్ర 2025" మాసోత్సవాల నిర్వహణపై అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జరుగుతాయని చెప్పారు. జిల్లాలో మే 21 నుంచి జూన్ 15 వరకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని, జూన్ 16 నుంచి 21వ తేదీ వరకు గుర్తించిన ప్రాంతాల్లో డెమానిస్ట్రేషన్ ఉంటుందని చెప్పారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో డిఆర్ఓ వై సత్యన్నారాయణరావు, ఎన్ఎఓబి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె మనోరమ, జిల్లా ఆయుష్ అధికారి కె లావణ్య, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మూనిసిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

దళితులపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

రాష్ట్ర హోంమంత్రి సొంత నియోజకవర్గంలో దళితులపై దాడి చేసిన వారిని నేటికీ అరెస్టు చేయకపోవడం అత్యంత దారుణమని, వెంటనే అరెస్టు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న గురువారం ఒక విడుదల డిమాండ్ చేశారు. నక్కపల్లి మండలం డొంకాడలో ఈ నెల 15న అగ్రవర్ణానికి చెందిన జీని లచ్చుబాబు వివాహం జరిగిందని, ఈ సందర్భంగా మైక్ అండ్ లైటింగ్ ఏర్పాటు పనికి వెళ్లిన దళితులపై సెల్‌ఫోన్ దొంగిలించారంటూ ఆరోపిస్తూ ఒరేయ్ మాల మాదిగ లంజా కొడుకుల్లారా అని తింటుకుంటూ జుట్టు పట్టుకుని కొట్టుకుంటూ, తిట్టుకుంటూ వినాయకుడు గుడి దగ్గరకు తీసుకొని వెళ్లి అక్కడ కింద పడేసి కొట్టారని తెలిపారు. ఈ సంఘటనపై ఈ నెల 19న నక్కపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పలు సెక్షన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. అయితే నిందితులను కాపాడే విధంగా స్టేషన్ బెయిల్ ఇవ్వడందారుణమన్నారు. దీని వల్ల తమకు న్యాయం జరగదని, తమపై జరిగిన దాడిని పరిగణనలోకి తీసుకొని సెక్షన్లు మార్పు చేయాలని దళితులు మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దోషులను ఆరెస్టులు చేయకుండా తాత్సారం చేయటం అన్యాయమన్నారు. హోంమంత్రి సొంత నియోజకవర్గంలో ఇటువంటి పరిస్థితి ఉంటే మిగిలిన ప్రాంతాల్లో దళితులకు రక్షణ ఏముంటుందని ప్రశ్నించారు. తక్షణమే హోంమంత్రి జోక్యం చేసుకొని దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని, దళితులకు రక్షణ కల్పించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

ఆర్ఎంపిలు గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆర్ఎంపీలు గర్భిణులకు ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ రిఫర్ చేయకూడదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలు బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత వైద్యం పొందడం వల్ల మాతృ శిశు మరణాలు నియంత్రించవచ్చని చెప్పారు. బిడ్డ పెరుగుదల తెలుసుకునేందుకు, జన్యుపరమైన వ్యాధులు, అంగ వైకల్యం నిర్ధారించుకునేందుకుగాను గర్భిణీలు అర్హులైన వైద్యులను సంప్రదించి, వారి సలహా తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ పరిధిలో 18, ప్రైవేట్ పరిధిలో 60 స్కానింగ్ సెంటర్లు సేవలందిస్తున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం సెక్షన్ 22 ప్రకారం, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, మేనేజ్మెంట్స్ వారి సెంటర్‌కి సంబంధించి స్కానింగ్ ముందు గాని తర్వాత గాని లింగ నిర్ధారణ గురించి ఏ విధమైన ప్రచార మాధ్యమంలోనైనా ప్రకటనలు ఇచ్చినట్లయితే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు సంబంధించి ఆసుపత్రులు ఏ విధమైన అతిక్రమణలకు పాల్పడిన ప్రజలు 18004253365 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని ప్రకటనలో తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి-సబ్బవరం : కూటమి ప్రభుత్వము ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. మండలంలోని స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల నుండి పలు సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు, వినతి పత్రాలను సుమారు 126 అర్జీలను స్వీకరించారు. ఇందులో ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు, భూ ఆక్రమణలు, చెరువులు గెడ్డ వాగులు ఆక్రమణకు సంబంధించిన ఫిర్యాదులు, పెన్షన్ మంజూరు కొరకు, తాగునీటి సమస్య కొరకు, రోడ్లు, డ్రైన్లు, కలవర్టు నిర్మాణం, కరెంటు సమస్యలు, మౌలిక వసతులపై అర్జీలు వచ్చాయి. ఈ సమస్యల పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ, తహశీల్దార్ బి.చిన్నకృష్ణ, పలు ప్రభుత్వ కార్యాలయాల శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పరవాడలో...

పరవాడ : పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు పరవాడ ఎంపీడీవో కార్యాలయం శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజాదర్బార్ -ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పెందుర్తి నియోజవర్గానికి సంబంధించి పరవాడ మండలం, పెదగంట్యాడ మండలం, జీవీఎంసీ వార్డుల పరిధిలో నివాసముంటున్న ప్రజలందరూ తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని పేర్కొంది. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా వారి ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్‌తో అర్జీ సమర్పించాలని కోరారు.

ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉగ్రవాదులు చర్యలకు మూలంగా పాకిస్తాన్‌పై సింధూర్ ఆపరేషన్ విజయవంతమైన సందర్భంగా అనకాపల్లి పట్టణంలో గురువారం తిరంగ ర్యాలీ నిర్వహించారు. రింగ్ రోడ్డు జంక్షన్ నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేష్ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పి గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, గండి బాబ్జి, మాదంశెట్టి నీలబాబు, గూనూరు మల్లు నాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీపం-2 గ్యాస్ సిలిండర్లు పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకం ద్వారా మంజూరు చేసిన ఉచిత గ్యాస్ సిలిండర్లును స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు గురువారం పంపిణీ చేశారు. 2వ విడతగా అందించే ఉచిత గ్యాస్ సిలిండర్‌ను ఆయన చేతుల మీదుగా స్వయంవరపు పద్మ లక్ష్మి కుటుంబ సభ్యులకు అందచేశారు. లబ్ధిదారుని ఇంటిలో వారే స్వయంగా టీ కాచి లబ్ధిదారునితో కలిసి టీ తాగారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్‌లు ఉచింతంగా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీఓ పద్మజ, పౌర సరఫరాల ఉప తహసీల్దార్ లీలా శేషకుమారి, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : వికలాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త బి. శకుంతల కోరారు. మండలంలోని సిడబ్ల్యూఎస్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆమె వికలాంగ చిన్నారులను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె వికలాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను గూర్చి వివరించి, ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. బడిఈడు కలిగిన వికలాంగ పిల్లలు బడిలో పేర్లు నమోదు కాకుండా బడి బయట ఉంటే వెంటనే సంబంధిత ప్రత్యేక ఉపాధ్యాయులకు, ఐఈఆర్టీలకు, సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్‌కు తెలియజేసి దగ్గరలో ఉన్న పాఠశాలలో చేర్పించాలని కోరారు.

వికలాంగ బాలికతో మాట్లాడుతున్న శకుంతల

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో డొంకాడ గ్రామంలో దళితులపై దాడి చేసిన ఆ గ్రామానికి చెందిన అగ్రవర్ణం పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి రాజేష్, దళిత నాయకులు డిమాండ్ చేశారు. నక్కపల్లిలో గురువారం దళితులతో కలిసి మాట్లాడారు. ఈనెల 18వ తేదీన దళిత యువకులు పై జరిగిన దాడి కేసులో 19న పోలీసులు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారని, 20న నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు గ్రామానికి వచ్చి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. దాడి జరిగి 5 రోజులు అవుతున్నా నేటికి దాడి చేసిన నిందితులను అరెస్టు చేయక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.నక్కపల్లి పోలీసులు నిందితులను కాపాడే విధంగా ఎఫ్ఐఆర్ లో బెయిలబుల్ సెక్షన్ లో కేసు నమోదు చేశారని, దీని కారణంగా నిందితులు వెంటనే బెయిల్ పొందే అవకాశం ఉందని, దీంతో దాడికి గురైన దళితులకు సరైన న్యాయం జరిగే అవకాశం లేదన్నారు. పోలీసు స్పందించి నిందుతులపై నాన్ బెయిలబుల్ సెక్షన్స్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుని, దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. నిందుతులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని, లేనిపక్షంలో దళిత సంఘాలు, సంస్థలు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు వీధి కన్నారావు, నొక్కు శివ, కుంచే రమణ, లోవరాజు సత్యనారాయణ ,బిల్లా,ఉప్పాటి ఆనందరావు ,సత్యనారాయణ దయాసాగర్, పోతురాజు, కిషోర్ సందీప్, మధు ,విజయ్, రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు, దళితులు

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

కంటి వైద్య పరీక్షా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- రావికమతం: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వైద్య పరీక్షా కేంద్రాన్ని చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్య స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కంటి వైద్య పరీక్ష కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుత జనరేషన్లో వయస్సుతో సంబంధం లేకుండా 30 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు.అన్నింటిలోనూ కన్ను చాలా ముఖ్యమైనదని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని ఆయన తెలిపారు. కంటి జబ్బులు రాకుండా పలు రకాల ఆకుకూరలు తీసుకుని కంటిని రక్షించు కోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మహాలక్ష్మి నాయుడు, గ్రామ సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఆర్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రసాదు, కంటి పరీక్ష కేంద్రం ప్రతినిధి ముక్కా రమేషు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి మహానాడు

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్:మండలంలో అడ్డురోడ్డు వద్ద మినీ మహానాడు కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మినీ మహానాడు వేదిక వద్దకు భారీగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముందుగానే తరలి వచ్చారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సారధ్యంలో మినీమహానాడుకు అతిరథ మహారథులు హాజరయ్యారు.తెలుగుదేశం పార్టీ జెండాను జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర ఎగురవేశారు. మాజీ ఎంపి సీనియర్ నాయకుడు పప్పల చలపతిరావు జ్యోతిప్రజ్వలన చేశారు. ఆపరేషన్ సిందూర్ అమర వీరులకు మౌనం పాటించి సంతాపం తెలియచేశారు. మినీ మహానాడు కార్యక్రమాన్ని జిల్లా టిడిపి అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు అధ్యక్షతన ప్రారంభించారు. కార్యకర్తల మనోభావాలకు విలువ ఇచ్చేలా మహానాడులో తీర్మానం చేయాలని అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలాగోవింద సత్యన్నారాయణ సూచించారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ, తెలుగుప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో నిలబెట్టిన ఘనుడు మన అన్న ఎన్టీ రామారావుకే దక్కుతుందన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలకు సేవ అందించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలకాయల విజయ్ అన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి మాట్లాడుతూ.... మాడుగుల అభివృద్ధికి జిల్లా మంత్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేయలేని ఈ పదవి ఎందుకు అంటూ బండారు సత్యన్నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఇంఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్రను, హోం మంత్రి అనితను బండారు కోరారు. హోంశాఖ మంత్రి అనిత మాట్లాడుతూ.... నియోజకవర్గంలో బల్క్ డ్రగ్ పరిశ్రమల ద్వారా లక్ష ఉద్యోగాలు, కోటవురట్ల మండలంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, 44 సంవత్సరాలలో తెదేపా ఎన్నో ఆటుపోట్లు, సంక్షోభాలను తట్టుకుని నిలబడిన పార్టీగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బుద్ద నాగ జగదీశ్వరావు, బోలేం ముత్యాలపాప, పీలా గోవింద సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మౌనం పాటిస్తున్న హోంమంత్రి, నాయకులు

మినీ మహానాడుకు తరలివెళ్లిన నేతలు

కోటవురట్ల: నియోజకవర్గంలోని రాయవరం మండలంలో నిర్వహించిన జిల్లా స్థాయి మినీ మహానాడు కార్యక్రమానికి గురువారం మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు లింగన్న నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి సుమారు 1500 మంది ఆటో, ద్విచక్ర వాహనాల పై ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రం నుంచి జానకి హరిబాబు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు.

భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని కే.గొట్టువాడ గ్రామంలో జగనన్న కాలనీ ద్వారా లబ్ది పొందిన ఓ లబ్దిదారుడు ప్రభుత్వం ఇచ్చిన స్థలం కంటే ఎక్కువ ఆక్రమించుకొని కాలనీ నిర్మాణం చేపట్టడంతో అందిన ఫిర్యాదు మేరకు గురువారం రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులు భాగాన్ని కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే నాటి జగనన్న ప్రభుత్వంలో ఇచ్చిన కాలనీ స్థలం సమీపంలో సర్వే నంబర్ 89-2 లో సెంటు భూమి, అదేవిధంగా ఆర్అండ్బి స్థలంలో రెండు అడుగుల స్థలంలో నిర్మాణం చేపట్టడంతో తహసీల్దార్ తిరుమల బాబు, ఆర్అండ్బి ఏఈ వెంకటరెడ్డి అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని, ఆక్రమణ స్థలంపై నిర్మాణదారులకు గతంలో 6-7 నోటీసులు అందజేశామన్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్ఐ ఉద్ధవరావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-చింతపల్లి: చిన్నబరడ గ్రామం తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎంపీడీవో శ్రీనివాసరావుకు కలిసి లిఖితపూర్వక విజ్ఞప్తి చేశారు. చిన్నబరడ గ్రామంలో సుమారు 90 కుటుంబాలు జీవిస్తున్నప్పటికీ తాగునీరు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2014లో నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో పెదబరడ, చిన్నబరడ గ్రామాలకు గ్రావిటీ కింద తాగునీటి పథకం అమలులోకి తెచ్చినప్పటికీ, ప్రస్తుతం ఆ నీరు కేవలం పెదబరడ గ్రామానికే సరిపోతుండటంతో చిన్నబరడకు సరఫరా నిలిచిపోయినట్లు గ్రామస్తులు తెలియజేశారు. జనసేన మండల ప్రధాన కార్యదర్శి రాజుబాబు పాల్గొన్నారు.

ఉచిత మొబైల్ ఫెర్టిలిటీ క్యాంప్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: విశాఖపట్నం ఒయాసిస్ ఫెర్టిలిటీ సంస్థ ఆధ్వర్యంలో ఒయాసిస్ జననీ యాత్ర ఉచిత మొబైల్ బస్ ఫెర్టిలిటీ క్యాంప్‌ను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం నర్సీపట్నం ఐదు రోడ్ల జంక్షన్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంతానం కలగని తల్లిదండ్రులకు ఇది ఒక అరుదైన అవకాశమని, ఉచితంగా ఈ సేవలు అందించబడుతున్నాయని తెలిపారు. ఒయాసిస్ జననీ నిర్వాహకులు మాట్లాడుతూ, క్యాంప్‌లో మహిళల కోసం పరీక్షలు ఉచితంగా చేసి డాక్టర్ల కౌన్సిలింగ్, స్కానింగ్ సేవలు అందించబడుతున్నాయని వివరించారు. ఈ శిబిరం ద్వారా ప్రజలకు సంతాన సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించడం, ప్రారంభ దశలలోనే అవసరమైన చికిత్సలు అందించడం లక్ష్యమని వారు పేర్కొన్నారు. గర్భధారణ సమస్యలతో బాధపడుతున్న దంపతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న

వ్యాపారమే పరమావధిగా...

-సెలవుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేటు కాలేజీలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:పట్టణంలో ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి మండువేసవిలోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. వ్యాపారమే పరమావధిగా మండు వేసవిలో విద్యార్థులను నిర్భంధించి ఐఐటీ, నీట్ తరగతులు అంటూ తల్లిదండ్రులను మభ్యపెట్టి సొమ్ములు చేసుకునే ప్రైవేటు కళాశాల యాజమా న్యాలు విద్యా కేంద్రాలను వ్యాపార కేంద్రాలుగా నిర్వహి స్తున్నారు. అందుకు సంబంధిత అధికారులు పట్టించు కోకపోవడం విస్మయం కలిగిస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూన్ 1వ తేదీ నుంచి కాలేజీల తరగతులు నిర్వహించాలి. కానీ ఈ నిబంధనలకు విరుద్ధంగా నర్సీపట్నంలో మాత్రం కొన్ని కాలేజీలు అమలు చేయడం లేదు. తమ కాలేజీల్లో విద్యార్థులను చేర్చుకోవాలనే తపనతో డెమో క్లాసులు పేరిట విద్యార్థులకు వల వేస్తున్నారు. ట్యూషన్లు, కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై ఇంటర్ బోర్డుకు నియంత్రణ లేక పోవడమే దీనికి కారణమని పలువురు తెలిపారు.

ఓ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు

కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

సెలవుల్లో నడుస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి.నిబంధనలకు విరుద్ధంగా వేసవి తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలల పై చర్యలు తీసుకోవాలి. నర్సీపట్నం లో ప్రైవేటు కళాశాలలు న్యూ అడ్మిషన్స్‌కు క్లాసులు నిర్వహిస్తున్నాట్లు తెలిసింది. ఇటువంటి నిర్బంధ విద్య ను ఎస్ఎఫ్ఐ ఖండిస్తున్నది. మండు వ్యాసోల్లో ఇటువంటి క్లాస్లు నిర్వహించడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

పి విజయ్ కుమార్,
ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యులు

తరగతులు నిర్వహించరాదు

పట్టణంలో ఇంటర్మీడియట్ క్లాసులు కొన్ని ప్రైవేటు కళాశాలలో నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. వాస్తవంగా ఏ కళాశాలలోనూ జూన్ రెండు వరకు తరగతులు నిర్వహించడానికి విద్యా ప్రమాణాలు నిబంధన మేరకు వీలు లేదు. అలా తరగతులు నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం కళాశాలలో ప్రిన్సిపాల్ సమక్షంలో కేవలం అడ్మిషన్ జరగటం మాత్రమే ఉండాలి. ఎటువంటి తరగతులు నిర్వహించడానికి వీలు లేదు.

సుజాత
ఇంటర్ బోర్డు రీజనల్ ఇన్స్పెక్టర్

అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు

నీతి కథలపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంథాలయంలో సమ్మర్ ఒరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా గ్రంథాలయధికారిణి దమయంతి విద్యార్థులతో నీతి కథలు చదివించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యా యుడు ప్రభాకర్ ఎదుటివారి విషయంలో అనవసరంగా జోక్యం చేసుకొని కోరి కష్టాలు తెచ్చుకోకూడదని కథ ద్వారా వివరించారు.కొన్ని ఆంగ్ల అక్షరములు ఇచ్చి వాటితో ఎన్ని పదాలు రాయొచ్చో పరీక్షపెట్టారు.

ప్రశాంతినగర్‌లో మునిగిన కాలనీ

వర్షాలకు.. లోతట్టు ప్రాంతాలు జలమయం

-శారదానగర్, ప్రశాంతి నగర్ కాలనీల వాసుల అవస్థలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలో ఎక్కువ శాతం ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు నివసించే మున్సిపాలిటీలో అతి ఖరీదైన బహుళ అంతస్తులు నిర్మించిన ప్రాంతంగా గుర్తింపు పొందిన శారదానగర్, ప్రశాంతి నగర్ లో ఖాళీ స్థలాలు జలమయమయ్యాయి. వర్షం వస్తే చాలు లోతట్టుగా ఉన్న ఇళ్ల స్థలాలు జలమయమై చెరువులను తలపించడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్లల్లో వాడుతున్న వ్యర్థ జలాలకు వర్షం నీరు తోడై డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై నీరు ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతంలోని వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లోతట్టు ప్రాంతంలో వర్షపు నీరు రోజుల తరబడి నిలవ ఉండిపోవడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలను గ్రావెల్ తో ఎత్తు చేసుకోవాలని ఇప్పటికే మున్సిపాలిటీ అధికారులు సూచించారు. శారదా నగర్, సత్య సాయి బాబా మందిరం నకు వెళ్లే మార్గంలో సత్య సాయి బాబా ఆర్చ్, బొంబాయి ట్రైలర్ వీధిలో వర్షం వచ్చిన ప్రతిసారి ఖాళీ స్థలాలు జలమయమై ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నర్సీపట్నం మున్సిపాలిటీలో ఖాళీ స్థలాలను గ్రావెల్‌తో నింపే విధంగా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శారదానగర్‌లో నిలిచిన నీరు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

చిరంజీవి జన్మదిన వేడుకలపై పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఉత్తరాంధ్ర చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ అభిమానుల సంఘం ఉపాధ్యక్షులు జాజుల రమణబాబు ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి 22వ తేదీ వరకు పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను నర్సీపట్నంలో నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ, చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు, పాటల, డాన్స్ పోటీలు, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సెక్రెటరీలు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, టౌన్ సీనియర్ నాయకుడు మీసాల సత్యనారాయణ, సత్యనారాయణ మూర్తి, మామిడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు సమ్మెపై నిర్బంధం తగదు

-పలు చోట్ల సిఐటియు నిరసనలు

ప్రజాశక్తి-మధురవాడ : స్టీల్‌ప్లాంట్‌లో తొలగింపులను నిరసిస్తూ సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై నిర్బంధం ప్రయోగించడం దుర్మార్గమని పలువురు ప్రజాసంఘాల నేతలు అన్నారు. ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు సంఘీభావంగా గురువారం మధురవాడ మార్కెట్ కూడలిలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.రాజు కుమార్, డి.అప్పలరాజు, డి.కొండమ్మ, మున్సిపల్ యూనియన్ నాయకులు జి.కిరణ్, వి సంధ్య, ఐద్వా నాయకులు కె.సుజాత,ఆటో సంఘాల నాయకులు డి.రవి,రాము పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. సంఘం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, నాయకులు వి.కృష్ణారావు, వి.నరేంద్ర కుమార్, కె.కుమారి, పి.శంకరరావు, ఎ.సింహాచలం పాల్గొన్నారు.

గాజువాక : స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు మద్దతుగా గాజువాక 100ఫీట్ రోడ్డులో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఇపుడు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాంబాబు, జోన్ కార్యదర్శి లోకేష్, బంగారు నాయుడు, గొలగాని అప్పారావు, జి రాము, ఎస్ గణేష్, నాగరాజు మీనాక్షి పాల్గొన్నారు.

ములగాడ: స్టీల్ ప్లాంట్ కాంటాక్ట్ కార్మికుల సమ్మెకు మద్దతుగా జివిఎంసి 59వ వార్డు నెహ్రూనగర్ లేబర్ జంక్షన్ వద్ద గమల్కాపురం జోన్ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు పెంటారావు, అధ్యక్షులు జె రాము నాయుడు, పైడి నాయుడు, సురేష్, కుమార్, అప్పలనాయుడు వై.గంగాధర్, డి.రాజేష్, ఎ.ప్రశాంత్ ఎస్‌కే సుభాని పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలని కోరుతూ సిఐటియు మల్కాపురం జోన్ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో శ్రీహరిపురంలోనూ, అలాగే జివిఎంసి 58, 59, 60 వార్డుల కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు నిరసనలో సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె.పెంటారావు ఆర్ లక్ష్మణమూర్తి, జివిఎంసి కార్మికుల మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.రమణ, డి రాజు, దుర్గారావు, ఆదినారాయణ, తిరుపతిరావు, అప్పలరాజు, రామారావు మహిళలు పాల్గొన్నారు

ఆరిలోవలో.

రాంబిల్లిలో..

ఆరిలోవ : తొలగించిన స్టీల్ కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ స్టీల్ సిఐటియు జూ కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో జూ పార్క్ వద్ద జాతీయ రహదారిలో నిరసన చేపట్టారు..సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి వెంకటరావు ఆరిలోవ జోన్ కార్యదర్శి వి. నరేంద్ర కుమార్, విశాఖ జూ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు ఎన్.అప్పలరాజు, ఎన్. నరేష్, ఎచ్చెర్ల పైడిరాజు, పి. నర్సింగరావు, శోభారాణి, జూ కార్మికులు 44 మంది పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ ఫార్మాసిటీ సింహాద్రి జంక్షన్లో విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగ అప్పారావు, రమణ, రాము, అప్పారావు, అప్పలనాయుడు, తాతబాబు పాల్గొన్నారు.

రాంబిల్లి : విశాఖ స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును వ్యతిరేకిస్తూ స్థానిక నేవీగేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి దేవుడు నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు వేలాది మంది కార్మికుల గోడు పట్టలేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ శివాజీ, బద్ది భాస్కరరావు, గంగరాజు, కాశియా, భద్ర పాల్గొన్నారు.

మల్కాపురంలో నిరసన చేపడుతున్న నాయకులు

శిరోముండనంతో వినూత్న నిరసన

శిరోముండనంతో వినూత్నంగా నిరసన తెలియజేస్తున్న మణి

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెపై ప్రభుత్వ, పోలీసు నిర్బంధం దారుణమని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి అన్నారు. ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలిపారు. మణి శిరోముండనం చేయించుకొని వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ పేరిట ఆడుతున్న డ్రామాలను తెలియజేశారు. రోజూ యోగా గురించి మాట్లాడేందుకు ముఖ్యమంత్రికి సమయం ఉంటుందిగానీ, స్టీల్‌ప్లాంట్ సమస్యలపై చర్చించేందుకు మాత్రం సమయం ఉండటం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, కె.నర్సింగరావు, డివైఎఫ్ఐ నాయకులు యుఎస్ఎన్.రాజు, ఉమా శైలజ, సంతోష్ పాల్గొన్నారు.

గాజువాకలో నిరసన చేపడుతున్న నాయకులు

డిప్యూటీ మేయర్‌ను కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: విశాఖపట్నంలో నగర పాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన విశాఖ డిప్యూటీ మేయర్ గోవిందరెడ్డి ని మర్యాదపూర్వకంగా మండల జనసేన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలకు మరింత చేరువగా పాలన ఉండాలని డిప్యూటీ మేయర్ ను కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు ఉడి చక్రవర్తి, నర్సీపట్నం మండలం వైస్ ఎంపీపీ రమణ, జనసేన సీనియర్ నాయకులు మోపాడ సత్యప్రసాద్ పాల్గొన్నారు..

డిప్యూటీ మేయర్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా?
అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		